ఆటల్లోనూ మెరుస్తున్న వజ్రాలు

- పూతలపట్టు నుంచి జాతీయ స్థాయికి
- ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు
- రాణిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలంటే మెరుగైన ఆర్థిక పరిస్థితులు ఉండాలి. శిక్షణ పొందడానికి, పోటీల్లో పాల్గొనడానికి ఖర్చులు భరించాలి. అసలు చదువుకోవడమే ఎక్కువగా భావించే పరిస్థితుల్లో నుంచి వచ్చిన పేద విద్యార్థులకు గతంలో పోషకాహారం కూడా అందేది కాదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక విద్యార్థులకు అన్ని రకాల విద్యాసామగ్రితో పాటు, మధ్యాహ్నం పౌష్టికాహారం అందిస్తోంది. దీంతోపాటు పూతలపట్టు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రీడల్లో రాణించేందుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు క్రీడల్లో జాతీయి స్థాయిలో మెరుస్తున్నారు.


జాతీయ స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీల్లో పూతలపట్టు పాఠశాల విద్యార్థినులు

పూతలపట్టు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటుకుంటున్నారు. విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటల్లోనూ రాణిస్తున్నారు. ప్రభుత పాఠశాల విద్యార్థులు ప్రవేటు విద్యార్థులతో సమానంగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మండలం నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తున్నారు. 2023 జూన్ నుంచి నవంబర్ నెల వరకు 22 మంది జాతీయ స్థాయికి, 28 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. దాదాపుగా 50 మంది పూతలపట్టు పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనడం విశేషం. పీడీలు కృష్ణా, ఢిల్లీరాణి శిక్షణతో 18 మంది అబ్బాయిలు, 32 మంది అమ్మాయిలు క్రీడా పోటీల్లో రాణించారు. టగ్‌ఆఫ్ వార్, సాఫ్ట్‌బాల్, మినీ ఫుట్‌బాల్, సైక్లింగ్, మలకం క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు తక్కువ సమయంలో ఎక్కువ మంది పాల్గొన్నారు.

మరింత ప్రోత్సాహం

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులందరూ పేదకుటుంబానికి చెందినవారే. విద్యార్థుల్లో బాగా ఆడగలిగే సామర్థ్యం, పట్టుదల ఉన్నా ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో పోటీపడాలంటే ప్రోత్సాహం, ఆర్థిక స్థోమత, శక్తి ఉండేదికాదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. రుచికరమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించింది. దీంతోపాటు మన జిల్లా నుంచి వేరే రాష్ట్రానికి వెళ్లి ఆడాలంటే ఒక్కో విద్యార్థికి దాదాపు రూ.3 వేలు ఖర్చు అవుతుంది. వీరందరికీ ఉపాధ్యాయులు, పాఠశాల పూర్వ విద్యార్థులు ఇతోధికంగా సాయం అందించడంతో విద్యార్థులు రాణిస్తున్నారు.

టీచర్ల సహాయం

పూతలపట్టు ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రతిభ గల విద్యార్థులను ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు విశ్వనాథరెడ్డి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే విద్యార్థులకు తనవంతు సహాయం చేస్తుంటారు. తరగతి ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని క్రీడల వైపు ప్రోత్సాహం అందిస్తున్నారు.

విద్యార్థులు పాల్గొన్న టోర్నీలు

- **టగ్‌ఆఫ్‌వార్:** జాతీయ స్థాయి టగ్‌ఆఫ్ వార్ క్రీడా పోటీలు జూలై 5 నుంచి 11 వరకు తమిళనాడులోని తిరుచందూర్ ప్రదేశంలో టగ్ ఆఫ్ వార్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించారు. ఈపోటీలకు పాఠశాల తరఫున సబ్ జూనియర్ 10, జూనియర్ కేటగిరీల్లో 10 మంది పాల్గొన్నారు.
- **సాఫ్ట్‌బాల్:** ఈ నెలలో గుంటూరు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. అందులో బాలాజీ రాష్ట్ర స్థాయిలో సత్తాచాటి. 2024 జనవరిలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. తేజశ్రీ, మేఘన ఇద్దరమ్మాయిలు రాష్ట్ర స్థాయి పోటీల్లో మెడల్ సాధించారు.
- **సైక్లింగ్:** నవంబర్ 11, 12 తేదీల్లో బాపట్లలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో కుషల్ కుమార్ సత్తా చాటారు.
- **మినీ ఫుట్‌బాల్:** స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నాసిక్, ధర్మపురిలో నిర్వహించిన మినీ ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన ఉదయ్ మెడల్ సాధించాడు.
- **మలఖాం:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఈనెలలో బాపట్లలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మలఖాం పోటీల్లో నలుగురు విద్యార్థులు సత్తాచాటారు.


జాతీయ స్థాయి విద్యార్థుల జట్టు


మైదానంలో సాఫ్ట్‌బాల్ ఆడుతున్న విద్యార్థి

ఇది నా అదృష్టం


ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో బాగా ఆడగలిగాను. వారు నాలోనున్న సామర్థ్యం ఏంటో నాకు తెలియజేశారు. జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ ఆడడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నేను జాతీయ స్థాయిలో ఆడడంతోనే నాకు పాఠశాలలో, ఊర్లో మరింత గుర్తింపు దక్కింది. ఆటలతోపాటు చదువులోనూ మంచి ర్యాంకును సాధిస్తాను.

– ఉదయ్, 10వ తరగతి, పూతలపట్టు

తల్లిదండ్రుల సంతోషం


మా తల్లి దండ్రులు ప్రైవేటు కంపెనీలో రోజువారి వేతనానికి పని చేస్తున్నారు. నేను జూన్‌లో కృష్ణా జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని రాణించాను. ఎప్పుడైతే రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడ్డానో, అప్పుడు చూసిన మా తల్లిదండ్రుల సంతోషానికి అవధుల్లేవు. మరిన్ని క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు మా తల్లి దండ్రులు సపోర్ట్ చేస్తున్నారు.

– తేజశ్రీ, 10వ తరగతి, పూతలపట్టు

నిత్యం విద్యార్థులతోనే


ఉదయం 8 నుంచి సాయంత్రం వరకు విద్యార్థులతోనే గడుపుతుంటాను. ఒక్కొక్క విద్యార్థి సామర్థ్యాన్ని బట్టి ఆ విద్యార్థికి ఆ క్రీడలో శిక్షణ ఇస్తుంటాను. ఈ విద్యాసంవత్సరంలో దాదాపు 50 మంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లాం. ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ ఉంటుంది. దాన్ని గుర్తించి అటు మళ్లించడమే నా లక్ష్యం.

–కృష్ణ, పీడీ, పూతలపట్టు

మంచిపేరు తెచ్చారు


విద్యార్థులు కష్టపడి ఆడి పాఠశాలకు మంచి పేరు తెచ్చారు. ఎల్లప్పుడు విద్యార్థులకు అన్ని విధాలుగా సహకారం, ప్రోత్సాహం అందిస్తున్నాను. ప్రభుత్వం విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందిస్తోంది. ఉపాధ్యాయులు ఇక్కడే మధ్యాహ్న భోజనాన్ని స్వీకరిస్తున్నారు. విద్యార్థులు క్రీడలతోపాటు చదువులో రాణించేలా తీర్చిదిద్దుతున్నాం.

–విశ్వనాథరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, పూతలపట్టు

యూటీఎఫ్ నూతన కార్యవర్గం


మొగిలయ్య


మోహన్‌రెడ్డి

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం మండల యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి ప్రకాష్ సమక్షంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా ధనంజయరాజు, అధ్యక్షుడుగా మొగిలయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా అమూల్య, భరత్‌భూషణ్, ప్రధాన కార్యదర్శిగా మోహన్ రెడ్డి, కోశాధికారిగా మహేష్ బాబు, కార్యవర్గ సభ్యులుగా పి బాలాజీ, శివరంజని, బుగ్గయ్య, డి బాలాజీ, యమున, చెంగయ్య, ఆదిలక్ష్మి, సోనిసుమలతను ఏకగ్రీవంగా ఎనికయ్యారు. జిల్లా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

గృహ నిర్మాణాలను సత్వరమే పూర్తిచేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగరాజు

ఐరాల: జగనన్న కాలనీల్లో మంజూరైన గృహాలను లబ్ధిదారులు సత్వరమే పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగరాజు సూచించారు. మండలంలోని నాగంవాండ్లపల్లె, 35 యర్లంపల్లె పంచాయతీల లబ్ధిదారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రెండు పంచాయతీల్లో ఇంకా ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాలు తక్షణం ప్రారంభించాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణాలను ప్రారంభించక పోతే లబ్ధిదారుల ఇంటి పట్టాలను రద్దు చేయాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సూచించారు. బిల్లులు ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తున్నామన్నారు. అదేవిధంగా స్టీల్, సిమెంట్, ఇసుక సకాలంలో అందజేస్తున్నందున ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. ఇబ్బందులు ఉంటే తెలుసుకుని పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, సర్పంచులు, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, హౌసింగ్ ఏఈ గుణశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవానికి హాజరుకండి

చిత్తూరు కలెక్టరేట్: నగరంలో ఆదివారం నిర్వహించనున్న భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని దర్గా సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు అందులో పేర్కొన్నారు.

ఇంటివద్దకే వస్తున్నాం


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: వైద్యసేవలు అందించేందుకు ఇంటి వద్దకే వైద్యులు వస్తున్నట్లు డాక్టర్ అనూష తెలిపారు. చామంతిపురం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచానపడిన రోగులకు ఇంటివద్దకే వెళ్లి వైద్యం అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం బీపీ, షుగర్, గర్భవతులకు వైద్యసేవలు, మందులు, మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలత, యమున, దేవప్రీత, రాధ పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందించాలి


వ్యాధి నిరోధక టీకాలను పరిశీలిస్తున్న వైద్యులు

యాదమరి: గ్రామాల్లో అర్హులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందించాలని వైద్యాధికారి అనిల్ కుమార్ నాయక్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని దిగువ గుట్టకింద దళితవాడలో శనివారం జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో మాతా శిశు మరణాలను తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆదేశించినట్లు తెలిపారు. దీనిపై వైద్య సిబ్బంది క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జెండర్ హింస నిర్మూలనపై అవగాహన


హింసకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

గుడిపాల: జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇందిరా క్రాంతి పథం ఏపీఎం సుధారాణి అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం మండల సమాఖ్యలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నవంబర్ 25 నుంచి డిసెంబర్ 22 వరకు గ్రామ సమాఖ్య పరిధిలో జెండర్ హింసా కార్యక్రమాలు, బాలిక విద్యపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నృత్యరూపక మహోత్సవం

అట్టహాసంగా ఆరంభం


కళాకారుల నాట్య ప్రదర్శన

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆస్థాన మండపంలో శనివారం 8వ నంది జాతీయ స్థాయి నృత్య రూపక మహోత్సవాలు అట్టహాసంగా ఆరంభమయ్యాయి. శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. అనంతరం కళాకారులు భరతనాట్యం, కూచిపూడి, నాటికలు ప్రదర్శించారు. ఇందులో మణిపురి నాట్యగురు చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పల్లంశెట్టి సురేష్, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, నృత్య గురువులు వెంకట సుబ్రమణ్యం, మొహిద్దీన్ ఖాన్, కమలా బాలాజీ, వేణుగోపాల్, రామ్మోహన్ రావు, కామేశ్వరి, నళిని రమణ, శ్రీలక్ష్మితోపాటు పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన సుమారు 200 మంది కళాకారులు పాల్గొన్నారు.


కథాకళి నృత్యం చేస్తున్న కళాకారులు



మణిపురి నాట్యగురువు అంగుమన్ గుప్తను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి , జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ మోహన్‌రెడ్డి, వెంకటేశు



నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీ జైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటలకు శిబిరం ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

75 మందికి వైద్య పరీక్షలు


వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి ప్రియాంక

తవణంపల్లె: మండలంలోని ద్వారకాపురంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి ప్రియాంక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 75 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా పరీక్షలు చేయించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భవతులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు యాదమరికి అయోధ్య అక్షింతలు

యాదమరి: మండల కేంద్రానికి అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలు, కలశం ఆదివారం విశ్వజనీయ హిందూ భక్తులు తీసుకురానున్నారు. జనవరి 22న అయోధ్యలో సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేకం అక్షింతలు ఉదయం యాదమరిలోని కర్పగ వినాయక స్వామి ఆలయం వద్దకు వస్తాయి. అక్కడి నుంచి ఊరేగింపుగా యాదమరి శ్రీ సీతారామ ఆలయం వరకు తీసుకెళ్లి ఆలయంలో భద్రపరచనున్నట్లు తెలిపారు. ఇందులో మండలంలోని భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

మారుతీ సుజుకి గ్రామీణ మహోత్సవం


ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం పీవీకేఎన్ కళాశాల మైదానంలో శనివారం భార్గవి ఆటో మొబైల్స్ ఆధ్వర్యంలో మారుతి సుజుకి నెక్సా గ్రామీణ మహోత్సవాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్ల అమ్మకాల్లో మారుతి సుజుకి అగ్రస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో జీఎం రమేష్‌బాబు, నిర్వాహకులు రజనీకాంత్ పాల్గొన్నారు.

పిరమలై కల్లర్ కులస్తుల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఈశ్వర్

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనలో పిరమలై కల్లర్ కులస్తులను ప్రత్యేకంగా గణించాలని పిరమలై కల్లర్ తేవర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న కులగణన నిర్ణయం చరిత్రాత్మకమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పిరమలై కల్లర్ కులస్తులు మూడుతరాలుగా కుల గుర్తింపు లేక ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. కులగణనలో తమ కులానికి గుర్తింపు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సౌందర్ తేవర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం ఘనంగా నిర్వహించారు. నవంబర్ 26న దేశ ప్రధాని నరేంద్రమోదీ రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఉదయం పాఠశాల ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విశేష ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.